రంగారెడ్డి | వికారాబాద్ | మేడ్చల్
వార్త

# మాకెన్నాళ్లు ఈ నిరీక్షణ

**-ఎమి కొనేటట్లు లేదు...తినేటట్లు లేదు**

**-జీతాల కోసం పంచాయతీ పారిశుధ్య సిబ్బంది ఎదురుచూపు**



**నందిగామ మార్చి4,ప్రభాతవార్త :**

పండుగలేదు...పబ్బం లేదు,ఎమి కొనెటట్లు లేదు..తినెటట్లు లేదని ఎన్నాళ్లు మాకీ కష్టాలని మండలం లోని గ్రామపంచాయతీలో పని చేస్తున్న పారిశుధ్య సిబ్బంది ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.రెక్కాడితే గాని డొక్కాడ లేని దుర్భర పరిస్థితుల్లో ఉదయం లేచింది.మొదలు పోద్దాస్తామానం రెక్కలు ముక్కలు చేసుకొని కంపుకొడుతున్న దుర్వాసన భరిస్తూ ప్రాణాలకు తెగించి చెత్తచెదారాన్ని తొలగించి ట్రాక్టర్లలో తరలిస్తున్నామని,బండ చాకిరీ చేస్తున్న మూడు నెలల నుండి జీతాల్లేక ఇబ్బందులు పడుతున్న పట్టించుకునే దిక్కే కరువైందన్నారు.పెరిగిన నిత్యవసర ధరలు ఒక ఎత్తైతె డిజిల్,పెట్రోల్,గ్యాస్ ,సీలిండర్ల ధరలు ఆకాశనంటుయని గోడు వెల్లబోసుకుంటున్నారు.ఏమి తినెటట్లు లేదు,పిల్లల చదువులకు ఫీజు కట్టలేని దౌర్భాగ్య పరిస్థితి నెలకొందన్నారు.కొన్ని గ్రామ పంచాయతీల్లో పారిశుధ్య సిబ్బంది గోస చూడ లేక సర్పంచ్‌లు అడపదడపా డుబ్బులిస్తూ పనులు చెయిస్తున్నారని విచారం వ్యక్తం చేస్తున్నారు. కొంత మంది సర్పంచ్‌లను జీతాలడిగితే కసురుకుంటూ కోపగిస్తున్నారని,మా గోడు ఎవరికి చెప్పుకోవాలని లభోదిబోమంటున్నారు.గ్రామపంచాయతీల్లో నిధులు లేక,సిబ్బందికి జీతభత్యాలు చెల్లించలేక సర్పంచ్‌లకు తల ప్రాణం తోకకోస్తూ ఎమి చేయలేని నిస్సాహాయ స్థితిలో పడ్డారని ఇప్పటికైన సంబంధిత జిల్లా ఉన్నతాధికారులు స్పందించి పారిశుధ్య సిబ్బందికి జీతాలు వెంటనే మంజూరు చేయాలని మోర పెట్టుకుంటున్నారు.

# 6న అనంతారంలో శ్రీమల్లన్న జాతర

**శామీర్‌పేట, మార్చి 4, ప్రభాతవార్త**

ఈ నెల 6వ తేదీన అనంతారం గ్రామంలో శ్రీమల్లిఖా ర్జునస్వామి(మల్లన్న) జాతర జరుగుతుందని అనంతారం గ్రామ యాదవ సంఘం వారు పేర్కొన్నారు. మూడుచింతలపల్లి మండలంలోని అనంతారం గ్రామంలో శ్రీమల్లిఖార్జునస్వామి జాతర సోమవారం జరుగుతున్నందున మూడు రోజుల నుంచి అన్ని ఏర్పాట్లు సిద్ధం చేస్తున్నట్లు నిర్వాహకులు పేర్కొ న్నారు. సోమవారం అనంతారంలో జరిగే శ్రీమల్లన్న జాతరకు భక్తులు భారీ సంఖ్యలో విచ్చేసి దర్శించు కోవాలని ఆ గ్రామ యాదవసంఘం సభ్యులు, జాతర నిర్వాహకులు కోరారు. శ్రీస్వామి వారి కల్యాణం, అగ్నిగుండాలు, బోనాల ఊరేగింపు కార్యక్రమాలు ఉంటాయని భక్తులు పాల్గొనాలని నిర్వాహకులు యాదవ సంఘం వారు కోరారు.

# ఊరడమ్మ తల్లికి ఎమ్మెల్యే ప్రత్యేక పూజలు

**శంకర్‌పల్లి, మార్చి 4, ప్రభాతవార్త :**

శంకర్‌పల్లి మున్సిపాల్ పరిధిలోని రామంతాపూర్ ఊరడమ్మ జాతరలో చేవెళ్ల ఎమ్మెల్యే కాలె యాదయ్య పాల్గొని అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. తీర్థప్రసాదాలు స్వీకరించారు. వార్డు కౌన్సిలర్ చాకలి ఆశోక్ ఎమ్మెల్యేను ఘనంగా సన్మానించారు. ఊరడమ్మ తల్లి ఆశీస్సులు ప్రజలందరిపై ఉండి సుఖసంతోషాలతో ఉండాలని కోరుకున్నారు. ఈకార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ విజయలక్ష్మి, బీఆర్ఎస్ నాయకులు తదితరులు ఉన్నారు.



ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్న ఎమ్మెల్యే

# ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికలు ప్రశాంతంగా జరిగేలా చర్యలు

**-పోలింగ్ కేంద్రాల వద్ద మౌలిక వసతులు కల్పించాలి**

**-మేడ్చల్ జిల్లా కలెక్టర్ అమోయ్‌కుమార్**

**-13న జిల్లాలో టీచర్స్ ఎమ్మెల్సీ ఎన్నికలు**



.మేడ్చల్ జిల్లా కలెక్టరేట్‌లో జరిగిన సమీక్షా సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా కలెక్టర్ అమోయ్‌కుమార్, పాల్గొన్న అదనపు కలెక్టర్ నర్సింహ్మారెడ్డి, డిసిపి జానకి, తదితరులు

**మేడ్చల్ జిల్లా ప్రతినిధి మార్చి 4, ప్రభాతవార్త**

ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికలు ప్రశాంతంగ నిర్వహించటానికి అన్ని రకాల చర్యలు తీసుకోవాలని, పోలింగ్ కేంద్రాల వద్ద మౌళిక వసతులు కల్పించాలని మేడ్చల్ జిల్లా కలెక్టర్ అమోయ్‌కుమార్ ఆదేశించారు. శనివారం మేడ్చల్ జిల్లా కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల నిర్వాహణపై సంబంధిత అధికారులతో సమీక్షా సమావేశంను కలెక్టర్ నిర్వహించారు. ఈ సందర్భంగ కలెక్టర్ అమోయ్‌కుమార్ మాట్లాడుతూ హైదరాబాద్, రంగారెడ్డి, మహబూబ్‌నగర్ ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికలు జిల్లా వ్యాప్తంగ ప్రశాంత వాతావరణంలో నిర్వహించాలని, ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా తగు చర్యలు చేపట్టాలన్నారు. ఎన్నికల నిర్వాహణలో సంబంధిత అధికారులు నిర్లక్ష్యం చేస్తే చర్యలు తప్పవని కలెక్టర్ స్పష్టం చేశారు. ఈ నెల 13వ తేదీన జరిగే ఎన్నికలకు జిల్లా వ్యాప్తంగ 14పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేసినట్లు, పది లోకేషన్లలో ఎన్నికలు జరుగనున్నట్లు, దీనికి సంబంధించి ఒక రోజు ముందుగానే ఈ నెల 12వ తేదీన ఉదయం 8గంటల నుంచి జిల్లా కలెక్టరేట్‌లోని స్ట్రాంగ్ రూమ్ నుంచి ఎన్నికల అధికారులు,సిబ్బందికి బ్యాలెట్ బాక్సులు, బ్యాలెట్ పేపర్లతో పాటు ఎన్నికల సామాగ్రిని అందజేయటం జరుగుతుందన్నారు. జిల్లాలో ఏర్పాటు చేసిన 14పోలింగ్ కేంద్రాల్లో వెబ్‌క్రాస్టింగ్ ద్వారా ఎన్నికలు నిర్వహిస్తున్నామని, పోలింగ్ జరుగుతున్న తీరు ఎప్పటికపుడు తెలుస్తుందన్నారు. ఓటింగ్ ప్రక్రియ సజావుగా నిర్వహించాలని, జిల్లా వ్యాప్తంగ ఏర్పాటు చేసిన పోలింగ్ కేంద్రాల్లో విద్యుత్ సౌకర్యం కల్పించటంతో పాటు లైటింగ్ ఏర్పాటు చేసి ఓటర్లకు ఇబ్బందులు లేకుండ టెంట్ వేసి త్రాగునీటి వసతి మౌళిక వసతులు కల్పించాలని కలెక్టర్ సూచించారు. బ్యాలెట్ బాక్సులు, బ్యాలెట్ పేపర్లు డిస్ట్రిబ్యూషన్ కేంద్రాల ఏర్పాటు నుంచి పోలింగ్ ముగిసిన తరువాత బ్యాలెట్ బాక్సులు రిసెప్షన్ కేంద్రాలకు చేరే వరకు పూర్తి బాధ్యత వహించాలన్నారు. జిల్లా వ్యాప్తంగ పోలింగ్ కేంద్రాల వద్ద 144సెక్షన్ అమలులో ఉంటుందన్నారు. 13న ఎన్నికలు ముగిసిన తరువాత బ్యాలెట్ బాక్సులను పోలీసు బందోబస్తుతో సరూర్‌నగర్‌లోని స్టేడియంకు తరలించి భద్రపర్చటం జరుగుతుందని కలెక్టర్ వివరించారు. ఈ సమావేశంలో జిల్లా అదనపు కలెక్టర్ నర్సింహ్మారెడ్డి, డిసిపి జానకి, డిఆర్ఓ లింగ్యానాయక్, ఆర్డీఓలు రవి, మల్లయ్య, సెక్టోరియల్ అధికారులు, నోడల్ అధికారులు, ఏసిపిలు, ఆయా శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# హామీలు నెరవేర్చని ప్రభుత్వాలు గద్దె దిగాలి

**-ప్రజా సమస్యలు తెలుసుకునేందుకే పాదయాత్ర**

**-కాంగ్రెస్ అధికారంలోకి వస్తేనే అంతా సుభిక్షం**

**-కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వీర్లపల్లి శంకర్**

**జిల్లెడు చౌదరిగూడ, మార్చి 04,(ప్రభాతవార్త):**

ఎన్నికల సమయంలో ప్రజలకు ఇచ్చిన హామీలు నెరవేర్చని బీఆర్ఎస్, బిజెపి ప్రభుత్వాలు గద్దె దిగాలని కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, షాద్‌నగర్ నియోజకవర్గ ఇంచార్జీ వీర్లపల్లి శంకర్ అన్నారు. శనివారం జిల్లెడు చౌదరి గూడ మండలంలోని రావిర్యాల, వీరసముద్రం గ్రామాల్లో హాత్ సే హాత్ జోడో పాదయాత్రను ఆయన ప్రారంబించారు. ఈ సందర్భంగా రావిర్యాల గ్రామం నుంచి వీరసముద్రం గ్రామం వరకు పాదయాత్ర నిర్వహించారు. మార్గమధ్యలో కలిసిన మహిళలు, వృద్ధులు, ప్రజలతో శంకర్ ఆప్యాయంగ మాట్లాడారు. ప్రస్తుత ప్రభుత్వాలు అమలు చేస్తున్న పథకాల గురించి తెలుసుకున్నారు. గతంలో కాంగ్రెస్ పార్టీ అందించిన అభివృద్ధి, సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించారు. ప్రస్తుత ప్రభుత్వాల నుంచి ప్రజలకు ఎలాంటి ఉపయోగం లేదని ఆయన అన్నారు. ప్రజల సమస్యలు క్షేత్రస్థాయిలో తెలుసుకోవాలనే ఉద్యేశ్యంతో కాంగ్రెస్ పార్టీ అధినాయకుడు రాహుల్ గాంధి కాశ్మీరు నుంచి కణ్యాకుమారి వరకు పాదయాత్ర చేపట్టారని తెలిపారు. పాదయాత్ర ద్వార గ్రామాల్లో గల ప్రజల సమస్యలు తెలుసుకున్నట్లు పెర్కొన్నారు. ఆయన మార్గంలోనే రాష్ట్ర కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు రేవంత్ రెడ్డి పాదయాత్ర చేపట్టి ప్రజల సమస్యలు తెలుసుకుంటున్నారని అన్నారు. రేవంత్‌రెడ్డి ఆదేశాల మేరకు ప్రతి నియోజకవర్గంలో, మండలంలో పాదయాత్రలు చేపడుతున్నట్లు ఆయన వివరించారు. ప్రస్తుత ప్రభుత్వాల పాలనలో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కోంటున్నారని అన్నారు. ఇందిరమ్మ ఇళ్లు, రుణమాఫి, రైతులకు ఉచిత కరెంటు, 104, 108 అంబులెన్సులు, ఆరోగ్యశ్రీ తదితర పథకాలు ప్రజలకు ఎంతో ఉపయోగపడ్డాయని అన్నారు. నేడు పథకాలు తక్కువ స్కామ్‌లు ఎక్కువగ జరుగుతున్నాయని ఆయన పెర్కోన్నారు. ప్రజా సౌలభ్యం కోసం అంటు జిల్లాలు, మండలాలు ఏర్పాటు చేసిన ప్రభుత్వం ఒక్క ప్రభుత్వ భవనాన్ని నిర్మించలేపోతున్నారని అన్నారు. సరైన వసతులు లేక అధికారులు, ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని ఆయన పెర్కోన్నారు. గ్రామాలకు రోడ్డు సౌకర్యాలు లేక ప్రయాణిలు, ప్రజలు అనేక ఇబ్బందులు పడుతున్న ఎవ్వరు పట్టించుకోవడం లేదని తెలిపారు. ధరణి పోర్టల్ ద్వార పేద రైతుల నుంచి భూములు లాక్కునె ప్రయత్నం చేస్తున్నారని తెలిపారు. ధరణిలో వచ్చే సమస్యలు ఎవ్వరి వద్దకు వెల్లిన పట్టించుకోవడం లేదని ఆయన పెర్కోన్నారు. తమ భూములు తమ పేరుపై మూర్చుకునేందుకు లక్షల రూపాయాలు ఖర్చు చేసుకోవాల్సి వస్తుందని అన్నారు. ప్రస్తుతం వంట గ్యాస్ ధరలు పెంచి సామాన్యుల నడ్డి విరుస్తున్నారని అన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఒకరిపై ఒక్కరు విమర్శలు చేసుకుంటున్నారే తప్ప ప్రజల సమస్యలు పట్టించుకోవడం లేదని అన్నారు. కాంగ్రెస్ పాలిత రాష్ట్రాల్లో గ్యాస్ ధర రూ. 500 ఉందని, రైతులకు రెండు లక్షల రుణమాఫి ఒక్కసారి చేసినట్లు ఆయన తెలిపారు. గ్రామాల్లో అనేక సమస్యలు ఉన్న ఎవ్వరు పట్టించుకోవడం లేదని పెర్కోన్నారు. వచ్చే ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రావడం ఖాయమని ఆయన దీమా వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు చలివేంద్రంపల్లి రాజు, బాల్‌రాజు, కృష్ణారెడ్డి, చంద్రశేఖర్, జితెందర్‌రెడ్డి, పురుశోత్తంరెడ్డి, ఆయా గ్రామాల కాంగ్రెస్ పార్టీ నాయకులు పాల్గొన్నారు.



మహిళలతో మాట్లాడుతున్న వీర్లపల్లి శంకర్

# 17,18న రాజీవ్ స్వగృహ ఓపెన్ ప్లాట్ల బహిరంగ వేలం





**ప్రభాతవార్త వికారాబాద్ జిల్లా ప్రతినిధి :**

యాల్ మండలం,కొకట్ గ్రామ పరిధిలోని గల రాజీవ్ స్వగృహ ఓపెన్ ప్లాట్లు,గృహాలను ఈ నెల 17,18 తేదిలలో బహిరంగ వేలం వెయ్యనున్నట్లు జిల్లా కలెక్టర్ సి.నారాయణ రెడ్డి తెలిపారు.శనివారం ఎంపిడివో కార్యాలయంలో నిర్వహించిన ప్రీ బిడ్డింగ్ సమావేశంలో కలెక్టర్ పాల్గొని మాట్లాడుతూ...అప్రూవ్డ్ లే అవుట్,అన్ని సదుపాయాలతో ఎలాంటి సమస్యలు లేని 54 గృహాలు,14 ఓపెన్ ప్లాట్లకు ఈనెల 17,18 తేదిలలో బహిరంగ వేలం వేయనున్నట్లు కలెక్టర్ తెలియజేశారు.ఇందులో మౌలిక సదుపాయాలైన తాగునీరు,డ్రైనేజీ,రోడ్లు,విద్యుత్ లంటి అన్ని సదుపాయాలు సమకూర్చడం జరిగిందన్నారు.100 గజాల నుండి 250 గజాల విస్తీర్ణం గల ప్లాట్లను మధ్యతరగతి వారికి ఉపయోపడే విధంగా ఉంటాయని అన్నారు.గతంలో బహిరంగ వేలం నిర్వహించి విక్రయించిన తర్వాత మిగిలిపోయిన ప్లాట్లను, గృహాలను మరోకసారి బహిరంగ వేలం నిర్వహించి విక్రయించడం జరుగుతుందన్నారు.వేలం పాటలో అత్యధిక పాట పడి ప్లాట్లను దక్కించుకునే వారు మొత్తం డబ్బులు ఒకేసారి చెల్లించిన వారికి రెండు శాతం సబ్సిడీ అందించడం జరుగుతుందని అలాగే 90 రోజులలో మూడు విడతలుగా కూడా చెల్లించవచ్చని తెలియజేశారు.ఇట్టి బహిరంగ వేలంలో ప్రజలు అధిక సఖ్యంలో పాల్గొని ప్లాట్లు,గృహాలను సొంత చేసుకోవాలని అన్నారు.ప్లాట్లను సొంతం చేసుకున్న తర్వాత ప్రభుత్వం మంచి అవకాశం కల్పించిందని భావిస్తారని అన్నారు.వేలంపాటలో పాల్గొనవాల్సిన వారు పదివేల రూపాయల డిడిని అందజేయవలసి ఉంటుందని తెలియజేశారు.ఈ సందర్భంగా పలువురు అడిగిన ప్రశ్నలకు కలెక్టర్ సవృత్తి చేశారు.ఎక్కువ మంది ప్రజలు మార్కెట్ వ్యాల్యూ తక్కువగా ఉన్నందున గజానికి కనీస ధర పదివేలు కాకుండా తగ్గిస్తే బాగుంటుందని కోరగా,ఇట్టి విషయాన్ని ప్రభుత్వానికి నివేదించడం జరుగుతుందని కలెక్టర్ తెలియజేశారు.

అంతకుముందు కొకట్‌లో గల రాజీవ్ స్వగృహ గృహాలు ప్లాట్లను కలెక్టర్ క్షేత్రస్థాయిలో పరిశీలించారు.అంతారం నుండి గౌతాపూర్ వరకు నిర్మిస్తున్న బైపాస్ రోడ్డు నిర్మాణపు పనులను కూడా కలెక్టర్ పరిశీలించారు.

సమావేశం అనంతరం జిల్లా కలెక్టర్ స్థానిక ఎంపిడివో,తహసీల్దార్ కార్యాలయాలను,తనిఖీ చేశారు.ఎంపిడివో కార్యాలయంలోని పరిసరాలలో ఉన్న చెత్తను తొలగించి పరిశుభ్రంగా ఉంచాలన్నారు.15 రోజుల తర్వాత తిరిగి వస్తానని అప్పటివరకు కార్యాలయాలను పరిశుభ్రంగా ,ఆహ్లాదకరంగా తీర్చిదిద్దాలన్నారు.తహసీల్దార్ కార్యాలయాన్ని సందర్శించి బాగుందని ప్రశంసించారు.కార్యాలయంలో ధరణి ఫిర్యాదులు రిజిస్టర్‌ను కలెక్టర్ పరిశీలించారు.టైటిల్,కబ్జాలో ఉన్న అన్ని సమస్యలు పరిష్కరించడం జరుగుతుందని ప్రజలకు మెసేజ్ వెళ్లాలి అన్నారు.మోటేషన్ లాంటి పనులు ఎప్పటికప్పుడు పరిష్కరించడం జరుగుతుందని తెలియజేశారు.అధికారులందరికి ధరణీపై పూర్తి అవగాహన ఉండాలని ప్రజలలో చెడ్డ పేరు తీసుకురావద్దని,ఏమైనా తెలియకుంటే స్వయంగా తనను సంప్రదించాలని కలెక్టర్ అధికారులకు సూచించారు.ఈ కార్యక్రమంలో అసిస్టెంట్ ట్రైనీ కలెక్టర్ సంచీత్ గంగ్వార్,ఆర్డిఓ అశోక్ కుమార్,తహసీల్దార్ చిన్నపల నాయుడు,ఎంపిడివో సుదర్శన్ రెడ్డి,తదితరులు పాల్గొన్నారు.

# ఎమ్మెల్యే టిక్కెట్టు ఆనంద్ కే..

**-జిల్లాలో ఇతర టిక్కెట్లు సైతం ఆనంద్ చెప్పినవారికే..**

**-విద్యాశాఖ మంత్రి సబితా ఇంద్రారెడ్డి**



బీఆర్ఎస్ ఆత్మీయ సమ్మేళనంలో మాట్లాడుతున్న విద్యాశాఖ మంత్రి పి.సబితా ఇంద్రారెడ్డి

**వికారాబాద్, మార్చి 4, ప్రభాతవార్త:**

ప్రస్తుత ఎమ్మెల్యే డాక్టర్ మెతుకు ఆనంద్‌కే వికారాబాద్ ఎమ్మెల్యే టిక్కెట్టు ఖాయమని, ఇందులో ఎలాంటి సందేహం లేదని విద్యాశాఖ మంత్రి పి.సబితా ఇంద్రారెడ్డి అన్నారు. శనివారం ధారూరు మండల కేంద్రంలోని ఓ ఫంక్షన్ హాల్లో బీఆర్ఎస్ మండల ఆత్మీయ సమ్మేళన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి మంత్రి ముఖ్యతిథిగా హాజరై ప్రసంగించారు. రాబోయే అసెంబ్లీ ఎన్నికల్లో ఆనంద్‌కు టిక్కెట్టు రాదని కొందరు లేనిపోని పుకార్లు పుట్టిస్తున్నారని, వారి మాటల్లో ఎలాంటి వాస్తవం లేదని అన్నారు. పార్టీ జిల్లా అధ్యక్ష బాద్యతలు సైతం ఆనంద్‌కే ఉన్నందున జిల్లాలో ఇతర నియోజకవర్గాల ఎమ్మెల్యే టిక్కెట్టు సైతం ఆనంద్ చెప్పినవారికే అధిష్టానం ఇవ్వనున్నట్లు స్పష్టం చేశారు. బీఆర్ఎస్ ప్రభుత్వం చేపడుతున్న సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్ళాలని, పార్టీని మరింత బలోపేతం చేసి రానున్న ఎన్నికల్లో పార్టీ గెలుపునకు ప్రతి కార్యకర్త కృషి చేయాలని సూచించారు. బీజేపీ పార్టీ శ్రేణులు సోషల్ మీడియాలో చేస్తున్న విష ప్రచారాన్ని ఎప్పటికప్పుడు తిప్పి కొట్టాలని అన్నారు. వికారాబాద్ ఎమ్మెల్యే డాక్టర్ మెతుకు ఆనంద్ మాట్లాడుతూ, సీఎం కేసీఆర్ సూచనల మేరకు ప్రతి మండలంలో బీఆర్ఎస్ పార్టీ ఆత్మీయ సమ్మెళనం నిర్వహించడం జరుగుతుందని తెలిపారు. గ్రామ స్థాయిలో ప్రతి కార్యకర్త ఓ సైనికుడిలా పార్టీ పటిష్టతకు కృషి చేయాలని సూచించారు. రానున్న ఎన్నికల్లో పార్టీ గెలుపునకు అందరు ఐఖ్యంగా ఉండి పార్టీ జెండా ఎగురవేయాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో జడ్పీటీసీ సుజాత, నాయకులు వేణుగోపాల్‌రెడ్డి, సంతోష్‌కుమార్, రాజునాయక్ తదితరులు పాల్గొన్నారు.

# ప్రభుత్వ పథకాలు అన్ని విజయవంతం చేస్తాం

**..మేడ్చల్ జిల్లా కలెక్టర్ అమోయ్‌కుమార్**

**..వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించిన..మంత్రులు, సిఎస్**

**మేడ్చల్ జిల్లా ప్రతినిధి మార్చి 4, ప్రభాతవార్త**

రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన పథకాలన్నింటిని జిల్లాలో విజయవంతంగ నిర్వహిస్తామని మేడ్చల్ జిల్లా కలెక్టర్ అమోయ్ కుమార్ పేర్కొన్నారు. శనివారం మేడ్చల్ జిల్లా కలెక్టరేట్ నుంచి వీడియో కాన్ఫరెన్స్‌లో జిల్లా కలెక్టర్ పాల్గొని మాట్లాడారు. అయితే నగరం నుంచి రాష్ట్ర మంత్రులు టి.హరీశ్‌రావు, ఎర్రబెల్లి దయాకర్‌రావు, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారిలు రాష్ట్రస్థాయి అధికారులతో కలిసి జిల్లాల కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. దీనిలో కంటి వెలుగు, పట్టణ ప్రాంతాల్లో రెండు పడక గదుల నిర్మాణం, 58,59,76 జిఓల మేరకు ఇళ్లస్థలాల క్రమబద్దీకరణ, పోడు భూములు అయిల్ ఫామ్ సాగుపై జిల్లాల కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్‌ను వారు నిర్వహించారు. ఈ సందర్భంగ పాల్గొన్న జిల్లా కలెక్టర్ అమోయ్‌కుమార్ మాట్లాడుతూ ప్రభుత్వం సూచించిన మేరకు ప్రభుత్వ కార్యక్రమాలను పక్కాగా ప్రణాళికల ప్రకారం నిర్వహిస్తున్నామన్నారు. జిల్లా వ్యాప్తంగ ప్రభుత్వ ఉత్తర్వులు జిఓ 58,59లను ఇప్పటికే పూర్తి చేయటం జరిగిందన్నారు. ప్రభుత్వ ఉత్తర్వు 118కి సంబంధించి ఆదివారం నాటికి పూర్తి చేసి లాగిన్ చేస్తామని కలెక్టర్ తెలిపారు. దీనికి సిఎస్ శాంతి కుమార్ స్పందిస్తూ జిల్లా వ్యాప్తంగ 58,59జిఓలకు సంబంధించి పూర్తి చేయటం పట్ల కలెక్టర్‌ను ఆమె అభినందించారు. ప్రభుత్వ కార్యక్రమాలను విజయవంతం చేయటానికి ఆయా శాఖల అధికారులతో సమీక్షా సమావేశాలు నిర్వహించటం జరుగుతుందని, ప్రభుత్వ ఆదేశాలు తూచా తప్పకుండ పాటిస్తామని కలెక్టర్ అమోయ్‌కుమార్ పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా అదనపు కలెక్టర్లు నర్సింహ్మారెడ్డి, అభిషేక్ ఆగస్త్య, జిల్లా అటవీ అధికారి జానకిరామ్, డిఎంఅండ్‌హెచ్ఓ డాక్టర్ శ్రీనివాస్, రోడ్లు భవనాల ఇఇ శ్రీనివాస్‌మూర్తి, మున్సిపల్ కమిషనర్లు, ఆయా శాఖల జిల్లా స్థాయి అధికారులు, తదితరులు పాల్గొన్నారు.



మేడ్చల్ జిల్లా కలెక్టరేట్‌లో వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న కలెక్టర్ అమోయ్‌కుమార్, పాల్గొన్న జిల్లా అదనపు కలెక్టర్లు నర్సింహ్మారెడ్డి, అభిషేక్ ఆగస్త్య, పలువురు అధికారులు

# వైభవంగా రావిచెడు వెంకటేశ్వరస్వామి కల్యాణం

**హాజరైన జడ్పీ చైర్మన్, ప్రజాప్రతినిధులు**



వెంకటేశ్వరస్వామి కళ్యాణంలో పాల్గొన్న ఎమ్మెల్యే

**కడ్తాల్, మార్చి 04 ప్రభాతవార్త :**

కడ్తాల్ మండలంలో శ్రీ వెంకటేశ్వరస్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా శనివారం శ్రీ శ్రీదేవి భూదేవి సమేత శ్రీ శ్రీనివాస కళ్యాణం అంగరంగ వైభవంగా జరిగింది. ఈ కళ్యాణానికి రంగారెడ్డి జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ తీగల అనితరెడ్డి, ఎమ్మెల్యే జైపాల్ యాదవ్, జాతీయ బిసి కమిషన్ మాజీ సభ్యులు తల్లోజు ఆచారి, ఐక్యత ఫౌండేషన్ చైర్మన్ సుంకిరెడ్డి రాఘవేందర్‌రెడ్డి, జడ్పీటిసి జర్పుల దశరథ్ నాయక్, ఆమనగల్లు సింగిల్ విండో చైర్మన్ గంప వెంకటేష్ గుప్తా, సర్పంచ్ భారతమ్మ వితరయ్య గౌడ్, ఎంపిటిసి గోపాల్, జోగువీరయ్య, యాదగిరిరెడ్డి, స్థానిక ప్రజాప్రతినిధులు హాజరయ్యారు. వే పండితుల ఆధ్వర్యంలో శ్రీనివాసస్వామి వారి కళ్యాణం అంగరంగ వైభవంగా భక్తి శ్రద్ధలతో కొనసాగింది. కళ్యాణాన్ని తిలకించేందుకు రావిచెడు గ్రామ ప్రజలే కాకుండా చుట్టుపక్కల గ్రామస్తులు అధిక సంఖ్యలో పాల్గొని కళ్యాణాన్ని కనులారా తిలకించారు. అనంతరం ఆలయ నిర్వాహకులు కళ్యాణానికి వచ్చిన భక్తులకు అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేశారు.

